

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

- పి4లో ప్రజల భాగస్వామ్యం అవసరం
- 10న ముఖ్యమంత్రి పర్యటనకు విస్తృత ఏర్పాట్లు
- కలెక్టర్ టిఎస్.చేతన్, ఎస్పీ వి.రత్న



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టిఎస్.చేతన్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కలెక్టరేట్లో పి4, తల్లికి వందనం, మెగా పిటిఎం (పేరెంట్స్ టీచర్స్ కమిటీ) కార్యక్రమాలపై ఎస్పీ వి.రత్నతో కలిసి వ ఇలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ఈనెల 10న నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 10న ముఖ్యమంత్రి చంద్రబాబు కొత్తచెరువుకు వస్తున్నారని చెప్పారు. ఆరోజు ప్రతి విద్యార్థి తల్లిదండ్రులతో కలిసి ఈ సమావేశానికి హాజరుకావాలని కోరారు. కొత్తచెరువులో తల్లిదండ్రులకు టగ్ఆఫ్‌వార్ పోటీలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పూర్వ విద్యార్థులతో పాటు పాఠశాలకు సహాయం చేసిన దాతలు కూడా కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. ప్రతి మండలంలో తహశీల్దార్, ఎంపిడిఒ, మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలియజేశారు. పి4లో జిల్లాలో ఉన్న పూర్వ విద్యార్థులు ఇతర పట్టణాల్లో స్థిరపడిన వారు తమ ఊరిలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలవాలన్నారు. తల్లికి వందనంకు సంబంధించి ఇప్పటివరకు 14,703 ఫిర్యాదులు అందాయని అందులో 10,803 ఫిర్యాదులను పరిష్కరించామని తెలిపారు. మిగిలిన 3,900 మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ప్రజా ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఎస్పీ రత్న మాట్లాడుతూ పిటిఎం కార్యక్రమానికి అన్ని మండలాల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భద్రత ఏర్పాట్లు చేస్తామన్నారు. కొత్తచెరువులో జూనియర్ కళాశాల ప్రాంగణంలో జరిగే ముఖ్యమంత్రి పర్యటనకు భద్రతాపరంగా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోవాలి : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పోలీస్ వ్యవస్థలో ప్రతి ఒక్కరూ సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఎస్పీ వి.రత్న జిల్లా స్పెషల్ బ్రాంచ్ సిబ్బందికి సూచించారు. క్షేత్రస్థాయిలో నిర్వహించాల్సిన విధులపై శనివారం ఎస్పీ జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో వారికి దిశా, నిర్దేశం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఫ్యాక్షన్ గ్రామాల్లో ఎలాంటి గొడవలు జరగకుండా ఎప్పటికప్పుడు ముందస్తు సమాచారం తెలుసుకొని జిల్లా ఉన్నతాధికారులకు అందించాలన్నారు. జిల్లాలో మొహర్రం వేడుకలు జరుగుతున్న వేళ ఎక్కడా ఎలాంటి గొడవలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అందరూ బాగా పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం స్పెషల్ బ్రాంచ్ సిబ్బందికి కిట్స్, లెదర్ బ్యాగులు అందజేశారు. సమావేశంలో ఎస్‌బి సిఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఆర్ఐ వలి, సోషల్ మీడియా ఎస్ఐ మునిప్రతాప్, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

జెఎన్‌టియులోనూ అధ్యాపకుల కొరత..!

- ఉన్నది మూడొంతులే.. ◆ బోధకుల్లేక భావి ఇంజినీర్లకు తప్పని తిప్పలు





ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జెన్‌టియునూ అధ్యాపకుల కొరత పీడిస్తోంది. పూర్తి స్థాయిలో బోధించేవారు లేకపోవడంతో బావి ఇంజినీర్లకు తిప్పలు తప్పడం లేదు. ఉండాల్సిన దానిలో మూడోవంతు మాత్రమే అధ్యాపకులు ఇక్కడ ఉన్నారు. తక్కిన అన్నీ పోస్టులు ఖాళీగానే ఉంటున్నాయి. రెగ్యులర్ అధ్యాకుల్లేకపోవడంతో సాంకేతిక విద్యను పూర్తి స్థాయిలో అవగాహన చేసుకోవడంలో విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు.

అనంత జెఎన్‌టియుకు సుదీర్ఘమైన చరిత్ర

భారత దేశానికి స్వాతంత్రం రావడం కంటే ముందే 1946లో అనంతపురం కేంద్రంగా ఇంజినీరింగు కళాశాల ఏర్పాటుకు అంకురార్పణ జరిగింది. మద్రాసు ప్రావినెన్సులో దీని ఏర్పాటుకు చర్యలు మొదలయ్యాయి. మొదటి గుండి ప్రాంతంలో ప్రారంభం అవగా 1948లో అనంతపురానికి బదిలీ అయింది. అప్పటి నుంచి మద్రాసు యూనివర్శిటీ అనుబంధంగా నడిచింది. 1955లో దీన్ని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధిలోకి మార్చారు. 1972లో భారత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు సాంకేతిక విద్యను ఇతర విశ్వవిద్యాలయాల నుంచి వేరుచేశారు. అప్పుడు అనంతపురం జెఎన్‌టియు కళాశాల హైదరాబాద్ జెఎన్‌టియు అనుబంధంగా మారింది. 2008లో దీన్ని విశ్వవిద్యాలయంగా మార్చారు. అప్పటి నుంచి ఈ విశ్వవిద్యాలయం పరిధిలో అనంతపురం జెఎన్‌టియు కళాశాలతోపాటు, పులివెందుల, కలికిరి ఇంజనీరింగ్ కళాశాలతోపాటు ఒటిఆర్ఐని అనంతపురం జెఎన్‌టియు కళాశాలుగా మార్చారు. ఇక్కడ నుంచి పెద్ద పెద్ద స్థాయిలో ఉద్యోగాలు చేసేవారు ఉన్నారు.

ఉన్నది మూడొంతులే..!

ప్రతిష్టాత్మకమైన జెఎన్‌టియు విశ్వవిద్యాలయంను అధ్యాపకుల కొరత వెంటాడుతోంది. దీని పరిధిలో ఆరు డిపార్టుమెంట్లు ఉన్నాయి. మొత్తం 300 మంది బోధనా సిబ్బంది ఉండాల్సి ఉంది. ఉన్నది మాత్రం 94 మంది మాత్రమే. తక్కిన 206 పోస్టులు ఖాళీగా నున్నాయి. ప్రొఫెసర్లు తొమ్మిది మంది, అసోసియేట్ ప్రొపెసర్లు 33 మంది, 164 పోస్టులు అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా నున్నాయి. ఇంత పెద్దఎత్తున ఖాళీగా ఉండటంతో విద్యాబోధన అంతంత మాత్రంగానే ఉంటోంది. ఉన్న కొద్ది మందిలోనూ ఎక్కువ మంది పరిపాలనాపరమైన బాధ్యతలు చూస్తున్నారు. వీరు కళాశాలలకు వెళ్లి విద్యాబోధన చేయడం కష్టతరమైన పనిగా ఉంటోంది. అసలే సాంకేతిక విద్య కావడంతో బోధకులు లేకుండా విద్యను అభ్యసించడం పెద్ద సమస్యగానే ఉంటోంది. ప్రభుత్వం గతంలో ఈ పోస్టుల భర్తీని నోటిఫికేషన్ జారీ చేసినా వివిధ కారణాలతో భర్తీ చేయలేదు. విశ్వవిద్యాలయంలోని అనంతపురం జెఎన్‌టియు కళాశాలకు మంచి విద్యను అందించేదిగా పేరుంది. ఇప్పుడు చూస్తే బోధకుల తక్కువగా ఉండటంతో ఎంతో ఆశగా వచ్చే విద్యార్థులకు నిరాశ తప్పడం లేదు.



మాట్లాడుతున్న ఎస్‌హెచ్.బాషా

చేనేత కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి వల్ల చేనేత కార్మికులు అనేక సమస్యలతో బాధపడుతు న్నారని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న పేర్కొన్నారు. పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో శనివారం ఎపి చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా జంగాలపల్లి పెద్దన్న, ఎస్‌హెచ్.బాషా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ నేసిన చీరలకు గిట్టుబాటు ధర లేక పనులు లేక పవర్‌లూమ్ ధాటికి తట్టుకోలేక ఆకలి బాధలు తట్టుకోలేక చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇకనైనా ప్రభుత్వాలు చేనేత కార్మికునికి ఏటా రూ. 24 వేలు ఇవ్వాలని, హెల్త్ కార్డులు పంపిణీ చేయాలని, నేసిన చీరలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. తాము పవర్ లూమ్‌కి వ్యతిరేకం కాదు.. పవర్ లూమ్‌గా నేసే 11 రకాలకు మాత్రమే వ్యతిరేకం అన్నారు. ఈ పవర్‌లూమ్ మగ్గాలను పట్టణానికి 20 కిలోమీటర్ల అవతల ఏర్పాటు చేసుకోవాలని డిమాండ్ చేశారు. నూతన కమిటీగా అధ్యక్షులుగా ఖాదర్‌బాషా, కార్యదర్శిగా గుంపు హరికుమార్, కోశాధికారిగా వెంకటస్వామి, ఉపాధ్యక్షులు, మెంబర్లుగా రవి, సన్నప్పయ్య, నారాయణస్వామి, అన్నం సూరి, శ్రీహరి, లోకేష్, అల్తాఫ్, చౌడప్పను నియమించారు.

నియోజకవర్గంలో అరాచక పాలన : దుద్దుకుంట

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

నియోజకవర్గంలో ప్రస్తుతం అరాచక పాలన సాగుతోందని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. నాలుగు రోజుల క్రితం మండలంలోని వెంగళమ్మచెరువు గ్రామంలో రైతు వీరనారప్ప మామిడి చెట్లను కొందరు వ్యక్తులు నరికి వేశారు. ఈ విషయం తెలుసుకున్న శ్రీధర్‌రెడ్డి శనివారం ఆ గ్రామం వెళ్లి వీరరప్ప కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మామిడి చెట్లు నరికిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కొందరు వ్యక్తులు విష సంస్కృతికి తెర లేపారని మండిపడ్డారు. రైతు సాగుచేసే పచ్చని చెట్లను సైతం నరికి వేయడం దారుణమని, ఇలాంటి వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పేదలకు ఎటువంటి న్యాయం జరగడం లేదన్నారు. వీరనారప్పకు పోలీసులు న్యాయం చేయకపోతే డిజిపి, నేషనల్ హ్యూమన్ రైట్స్‌కి ఫిర్యాదు చేస్తామన్నారు.



నరికేసిన మామిడి చెట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే

పి-4 అమలుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి : మంత్రి



సుపరిపాలనలో తొలి అడుగులో పాల్గొన్న మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

నియోజకవర్గ పరిస్థితులకు అనుగుణంగా పి-4 అమలుపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించా లని మంత్రి సవిత తెలిపారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయ ఆవరణలో ఉన్న భువన విజయం సమావేశం మందిరంలో శనివారం మంత్రి నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ కేంద్రం తీసుకున్న లక్ష్య సాధనకు అనుగుణంగా రాష్ట్రాన్ని హెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సిఎం చంద్రబాబు పి-4 పథకం అమలు చేస్తున్నార న్నారు. పేద ధనిక అంతరాలు తగ్గించేందుకే ఈ పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. పి-4 ప్రోగ్రామ్ ద్వారా నియోజకవర్గంలో అట్టడుగున ఉన్న 7,264 కుటుంబాలను ఆదుకోవాలనేది తమ లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో ఆనందకుమార్, డీఎస్పీ నరసింగప్ప, కమిషనర్ సతీష్‌కుమార్, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెప్పినవే కాదు.. చెప్పనవి చేశాం

సోమందేపల్లి : ఈ ఏడాది పాలనలో చెప్పినవే కాదు చెప్పనవి చేశామని మంత్రి సవిత తెలి పారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా శనివారం ఆమె మండలంలోని మాగే చెరువు గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమం, అభివృద్ధి గురించి వివరించారు. ప్రజల అభిప్రాయాలు, సమస్యలు తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ గాలికి వచ్చిన పార్టీ గాలికే పోయిందన్నారు. వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని నాశనం చేయగా, కూటమి ప్రభుత్వం అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తుందన్నారు. మంత్రి వెంట సర్పంచి నరసింహులు, మాజీ జడ్పిటిసి వెంకటరమణ, మండల కన్వీనర్ వెంకటేష్, జెసిబి ప్రభాకర్, జెసిబి రంగా, శ్రీధర్, జనసేన నాగరాజు ఉన్నారు.

కెజిబివి హాస్టల్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



విలేకరులతో మాట్లాడుతున్న హరి

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని పాపిరెడ్డిపల్లె కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ(కెజిబివి) హాస్టల్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఎపి రైతు సంఘం, ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆ కెజిబివిలో శుక్రవారం ఫుడ్ పాయిజన్ వల్ల విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వీరేష్ కెజిబివిని సందర్శించారు. వారు మాట్లాడుతూ పాఠశాల సిబ్బంది నిర్లక్ష్య ధోరణి, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఈ సంఘటన జరిగిందన్నారు. విద్యార్థినులు, వారి తల్లిదండ్రులను తాము విచారించి నప్పుడు ఉడకని అన్నం, మధ్యాహ్నం మిగిలిన కూరలు రాత్రి వేళలో పెట్టడం, శుద్ధిచేసిన తాగునీటి సౌకర్యం లేకపోవడం, సమీపంలోని బోరు బావి నీరు తాగడం, తదితర విషయాలు వెలుగులోకి వచ్చా యన్నారు. ఈ సంఘటనతో కొందరు తల్లిదండ్రులు భయపడి పిల్లలను ఇంటికి తీసుకెళ్లిపోతున్నారని, అలాంటి వారికి అభద్రతా భావం నుంచి భరోసా కల్పించాలన్నారు. అలాగే ప్రభుత్వం, ఉన్నతాధికా రులు స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బిసి సంక్షేమ శాఖ మంత్రి నియోజకవర్గంలోనే ఇలా జరగడం దురదృష్టకరమన్నారు. వారి వెంట ఎస్ఎఫ్ఐ నాయకులు చక్రి, శ్రావణ్, తదితరులు ఉన్నారు.

కారకారులపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

పాపిరెడ్డిపల్లి కెజిబివిలో ఫుడ్ పాయిజన్ ఘటనకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం డిప్యూటీ తహశీ ల్దార్ రెడ్డిశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పాఠశాలలో అపరిశుభ్రత, తాగునీరు కలుషితం, నాణ్యతలేని ఆహారం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం, తదితర విషయాలు అధికారుల విచారణలో వెలుగు చూశాయన్నారు. దీనికి తోడు కుక్ క్రమశిక్షణారాహిత్యంగా ఉండడం ప్రధాన కారణమన్నారు. ఇదే పాఠశాలలో ఫుడ్ పాయిజన్ వల్ల పలుమార్లు విద్యార్థులు అస్వస్థకు గురయ్యారని గుర్తుచేశారు. కావున ఈ ఘటనకు కారకులైన వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హనుమయ్య, మాబు, పెద్దన్న, రవి, వెంకటేష్, నాగభూషణ, గోవిందప్ప, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ ఈయు నిరసన

ప్రజాశక్తి-హిందూపురం

ఆర్టీసీ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమం శనివారం 2వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా యూనియన్ రీజినల్ అధ్యక్షులు నారాయణస్వామి, డిపో కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ ఆర్టీసీలో నూతనంగా ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీఏ బకాయిలతోపాటు 11వ పిఆర్‌సి అరియర్స్ మంజూరు చేయాలన్నారు. వీటితో పాటు కార్మికుల న్యాయమైన సమస్యలన్నింటినీ పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బాబయ్య, విగ్నేశ్వర, ఈర్షదుల్లా తదితరులు పాల్గొన్నారు.



పి4పై సమీక్ష సమావేశం జరుగుతుండగా సెల్‌ఫోన్ ముచ్చట్లలో నిమగ్నమైన అధికారులు

సమీక్ష వద్దు.. సెల్‌ఫోన్ ముద్దు..!


సమావేశంలో అధికారుల సెల్ ముచ్చట్లు

ప్రజలకు జవాబుదారీగా ఉండి బాధ్యతగా మెలగాల్సిన అధికారులు వారి విధులను పక్కన బెట్టారు. ప్రజావసరాలు తీర్చేందుకు ప్రణాళికలు తయారు చేసే సమీక్ష సమావేశంలో అధికారులు సెల్‌ముచ్చట్లతో మునిగిపోయారు. మీడియా, ఇతర ఉన్నతాధికారులు చూస్తున్నారన్న సోయ కూడా లేకుండా సెల్ రీల్స్ చూస్తూ గడిపేశారు. శనివారం నాడు పెనుకొండ ఆర్డీవో కార్యాలయం భువన విజయం సమావేశ మందిరంలో అధికారులు వ్యవహరించిన తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన పి-4 అమలుపై పెనుకొండ నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ సమావేశాన్ని ఆర్డీవో ఆనంద్ కుమార్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత హాజరయ్యారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు. పి4 యాక్షన్ ప్లాన్‌పై అధికారులు చర్చల అనంతరం మంత్రి మాట్లాడుతున్న సందర్భంలో అధికారులు సెల్ ఫోన్‌లో నిమగ్నం అయ్యారు. కనీసం మంత్రి ఏమి చెబుతోంది అన్నది కూడా వినకుండా సెల్ ప్రపంచంలో మునిగిపోయారు. మంత్రి మాట్లాడుతుంటే 'సమీక్ష మాకొద్దు.. సెల్‌ఫోన్ ముద్దు' అన్న రీతిలో అధికారులు వ్యవహరించారు. అధికారుల సెల్‌ముచ్చట్లపై అక్కడున్న మీడియా, ఇతర నాయకులు విస్మయం వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి-పెనుకొండ

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధం

సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్పీ శ్రీనివాసులు



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్‌పి శ్రీనివాసులు

ప్రజాశక్తి-హిందూపురం

పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుంటే నిరవధిక సమ్మెకు సిద్ధం అవుతామని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్పీ శ్రీనివాసులు తెలియజేశారు. కాంట్రాక్ట్ పారిశు ధ్య కార్మికులు శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన దీక్షలు 12వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కనీస వేతనాలు ఇవ్వాలన్నారు. విధులు నిర్వహిస్తూ మృతి చెందిన కార్మికుల మట్టి ఖర్చులు ఇవ్వాలన్నారు. చనిపోయిన, రిటైర్డ్ అయిన తర్వాత కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలన్నారు. మృతి చెందిన కార్మికుల కుటుంబ సభ్యులకు రూ.7 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. కార్మికులకు ఉద్యోగ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. అవసరమైన పనిముట్లు ఇవ్వాలన్నారు. ఈ సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ దీక్షల్లో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు మల్లికార్జున, కార్యదర్శి జగదీష్, కోశాధికారి ఆనంద్, నాయకులు రామచంద్ర, బాబయ్య, మూర్తి, చంద్రశేఖర్ కుమార్, బాలాజీ, చంద్ర, మూర్తి, శంకర, కవితమ్మ, గంగరత్నమ్మ, శోభమ్మ, ఓబులమ్మ పాల్గొన్నారు.

కేసుల పరిష్కారంలో రాజీమార్గం ఉత్తమం

అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ



కక్షిదారులకు అవార్డు ప్రతిని అందజేస్తున్న న్యాయమూర్తులు కంపల్లె శైలజ, వెంకటేశ్వర్లు నాయక్, రమణయ్యలు



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి జయలక్ష్మి


ప్రజాశక్తి-హిందూపురం

కేసుల పరిష్కారంలో రాజీమార్గం కక్షిదారులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ పేర్కొన్నారు. శనివారం స్థానిక న్యాయస్థాన సముదాయంలో జాతీయ మెగా లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిజితోపాటు, సీనియర్ సివిల్ జడ్జి డి.వెంకటేశ్వర్లు నాయక్, ప్రత్యేక మెజిస్ట్రేట్ రమణయ్య నేతత్వంలో మూడు బెంచ్‌లను ఏర్పాటు చేసి 128 కేసులను పరిష్కరించారు. ఇందులో భాగంగా జరిగిన సమావేశంలో అదనపు జిల్లా జడ్జి మాట్లాడుతూ రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవడం ఇరువర్గాలకు మేలు చేస్తుందని చెప్పారు. న్యాయవాదులు, స్వచ్ఛంద సంస్థలు సైతం రాజీమార్గం పై కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఐసిఐసిఐ బ్యాంక్ ఆధ్వర్యంలో లోక్‌అదాలత్‌కు హాజరైన వారందరికీ భోజన సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీపీలు ఇందాద్, నగేష్, ఏజీపీ శ్రీనివాస్ రెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు సుదర్శన్, సంతోషి కుమారి, రవిచంద్ర, రమేష్, మురళి, కళావతి లతోపాటు ఆయా బ్యాంకుల మేనేజర్లు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం : జడ్జి

కదిరి టౌన్ : చిన్న చిన్న విషయాలకు ఆవేశాలకు లోనైతే అనర్థాలు మాత్రమే మిగులుతాయని మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.జయలక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమెతో పాటు జడ్జి పి.లోకనాథం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ రాజీమార్గమే రాజ మార్గం అనే ప్రజా న్యాయ స్థానాల మూల సూత్రాలను అలవర్చుకోవడంతో పాటు అందులోని అవకాశాలను అందిపుచ్చుకోవాల న్నారు. కేసుల తీరును పరిశీలిస్తే అందులో అన్నదమ్ములు, బావ బామ్మర్దులు, తదితర రక్తసంబంధాలకు చెందిన వారు ఉండడం ఆవేదన కలిగించే అంశం అన్నారు. క్రిమినల్ కేసుల్లో ఇరుక్కుని ఆర్థిక ఇబ్బందులకు లోనవుతుంటారన్నారు. బంధుత్వాలు దూరమైపోతాయని గ్రహించలేకపోతున్నారన్నారు. ఎవరూ క్షణికావేశానికి లోను కాకూడదని హితవు పలికారు. అనంతరం జడ్జిలు చెరొక బెంచి ద్వారా కేసులను పరిష్కరించారు. ఇందులో సివిల్, క్రిమినల్ కేసులతో పాటు బ్యాంకులు, ఎక్సైజ్, చెక్ బౌన్స్, తదితర కేసులు పరిష్కరించబడ్డాయి. సదస్సులో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చౌడప్ప, ఎజిపి శివప్రసాద్, న్యాయవాదులు లోకేశ్వర్‌రెడ్డి, కె.నరసింహులు, దశరథ్, సిరాజుద్దీన్, వెంకటేష్ ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలను చేస్తున్న వైద్యులు

హిందూపురం : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. కడపకు చెందిన పుష్పగిరి కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరంలో సుమారు 50 మంది కంటి పరీక్ష చేయించుకున్నారు. ఇందులో 20 మందికి శస్త్ర చికిత్సలు అవసరమైనట్లు వైద్యులు నిర్ధారించారు. రోగులకు కడప పుష్పగిరి కంటి ఆసుపత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయడం జరుగుతుందన్నారు. ఉచిత రవాణా సౌకర్యం, భోజన వసతి కూడా కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు కళ్యాణ్, కార్యదర్శి శ్రీధర్ గౌడ్, నేత్ర వైద్యాధికారి సుబ్బారావు, డాక్టర్ ఆదినారాయణ, సభ్యులు అరుణ్ కుమార్, శివయ్య, ఓబులకొండయ్య, నాగన్న, పవిత్ర, గిరిధర్ పాల్గొన్నారు. ప్రతినెలా మొదటి శనివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం జరుగుతుందని క్లబ్ ప్రతినిధులు తెలిపారు.

ముస్లిముల సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కదిరి అర్బన్

రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం మరిచి స్వార్ధం కోసం పాలన చేసి చరిత్ర హీనుడిగా నిలిచిన ఏకైక సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని 29వ వార్డులో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి సుపరిపాలన కరపత్రాలను పంపిణీ చేసి అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు వివరించారు. ప్రజల అభిప్రాయాలు, సమస్యలు తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల పేరుతో జనాలను మోసం చేసిన ఘనత జగన్‌దే అన్నారు. ముస్లిం మైనార్టీ కార్పొరేషన్‌ను విస్మరించిన వైసిపికి మైనార్టీలు గట్టిగా గుణపాఠం చెప్పారన్నారు. మైనార్టీలకు రంజాన్ తోఫా, చిరు వ్యాపారాలు చేసుకుంటున్న వారికి రుణాలు మంజూరు చేయడానికి కూటమి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. ప్రతి మండలంలో మైనార్టీలకు షాదీమహల్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. విదేశీ విద్యను కొనసాగించడానికి బాధ్యత తీసుకుంటానన్నారు. ఆయన వెంట మున్సిపల్ ఛైర్‌పర్సన్ దిల్షాద్ ఉన్నీసా బహుద్దీన్, మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, సంబంధిత అధికారులు, టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, టిడిపి బిసి విభాగం అధ్యక్షుడు నాగప్ప, దాబా గంగయ్య, శంకర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.


దివ్యాంగుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కందికుంట

వైభవంగా జగన్నాథ రథయాత్ర

ప్రజాశక్తి-హిందూపురం

హరే కృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో శనివారం కోలాహలంగా జగన్నాథ రథయాత్ర జరిగింది. పట్టణ, పరిసర ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు రథయాత్రలో పాల్గొన్నారు. పట్టణంలోని హరేకృష్ణ కల్చరల్ సెంటర్ నుంచి ప్రారంభమైన రథయాత్ర ఆర్టీసీ కాలనీ, బిఎస్‌టి పెట్రోల్ బంక్, అంబేద్కర్ సర్కిల్, మెయిన్ బజార్, చిన్న మార్కెట్ మీదుగా వాల్మీకి కళ్యాణ మండపం వరకు కొనసాగింది. సర్వాంగ సుందరంగా అలంకరించిన గతంలో శ్రీకృష్ణ విగ్రహాన్ని ఉంచి ప్రత్యేకంగా అలంకరించారు. మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు నడుమ రథయాత్ర వేలాది మంది భక్తుల కృష్ణ నామస్మరణ నడుమ కొనసాగింది. సాయంత్రం వాల్మీకి కళ్యాణమంటపంలో శ్రీకృష్ణ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. 54 ఇందులో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు కొండూరు వేణుగోపాల్ రెడ్డి, కోటిపి హనుమంత్ రెడ్డి, టిడిపి నాయకులు చంద్రశేఖర్ యాదవ్, జనసేన నాయకులు నిమ్మకాయల రాము, వివిధ సంఘాల నాయకులతో పాటు ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


రథయాత్రలో సేవలందిస్తున్న ఎల్ఆర్‌జి ఎన్‌సిసి విద్యార్థులు

దేవరపల్లిలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు

హిందూపురం : రూరల్ మండలం తూమకుంట పంచాయతీ పరిధిలోని దేవరపల్లి గ్రామంలో శనివారం సర్పంచి రత్నమ్మ చిన్న వీరప్ప నేతృత్వంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. అదనపు పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేసి మురుగు కాలువలను శుభ్రం చేయించారు. మురుగు కాలువల్లో పేరుకు పోయిన సిల్ట్‌ను తీసి ట్రాక్టర్ల ద్వారా తరలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేవరపల్లి గ్రామం పారిశ్రామిక వాడ సమీపంలో ఉండడంతో వ్యర్థాలు ఎక్కువగా కాలువల ద్వారా గ్రామంలోకి వచ్చి చేరుతున్నాయి. దీనికోసం అదనపు కార్మికులను ఏర్పాటు చేసుకుని, ప్రత్యేక పారిశుధ్య పనులు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కెంచరాయప్ప, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు రానీయొద్దు

నంబులపూలకుంట : రాబోయే వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని విద్యుత్ అధికారులు గ్రామాలను సందర్శించి విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని ఎంపిపి ఈటల రాము ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపిపి మాట్లాడుతూ డిపాజిట్ చేసిన రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు అందజేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఎంపిడిఒ పార్థసారథి, ఈవోఆర్‌డి మాధవరెడ్డి, ఎపిఎం వెంకటరమణ, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి అగ్రి గోల్డ్ బాధితుల సమస్యలు

కదిరి టౌన్ : అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ శనివారం అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అత్తార్ మహబూబ్ బాషా ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్‌కు విన్నవించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పట్టణంలోని 29వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా అత్తార్ మహబూబ్ బాషా ఎమ్మెల్యేని కలిసి అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు వివరించారు.

క్షయపై నిర్లక్ష్యం వద్దు

కొత్తచెరువు రూరల్ : క్షయ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏమాత్రం నిర్లక్ష్యం వహించరాదని పిహెచ్‌సి వైద్య సిబ్బంది సూచించారు. మండలంలోని లోచర్ల గ్రామంలో శనివారం డిటిసి సూపర్‌వైజర్ హబీద్ బాషా ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. దీర్ఘకాలిక దగ్గు, ఉదయం, సాయంత్రం జ్వరం రావడం, ఆకలి మందగించడం, తదితర లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాల న్నారు. సరైన చికిత్స వల్ల క్షయ నయమవుతుందని, భయపడాల్సిన పనిలేదని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యవంతంగా జీవించాలన్నారు. కార్యక్రమంలో ఎఎన్ఎం ప్రమీల, ఆశాలు లక్ష్మీదేవి, గంగరత్నమ్మ, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితునికి ఆర్థికసాయం

రొద్దం : మండలంలోని కంబాలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని శ్యాపురం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త బెస్త ఆదెప్ప కుమారుడు బెస్త అంజనప్ప రెండు నెలల క్రితం బైక్ యాక్సిడెంట్‌లో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొంది ప్రస్తుతం ఇంట్లో విశ్రాంతి తీసుకొంటున్నాడు. మంత్రి సవిత ఆదేశాల మేరకు శనివారం శ్యాపురంలో చేపట్టిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా టిడిపి నాయకులు అంజనప్ప ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకొని పరామర్శించారు. ఈ సందర్భంగా కంబాలపల్లి సర్పంచి కె.మంజు రూ. 5వేలు అందజేశారు. టిడిపి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రమేష్ యాదవ్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీవారి భక్తుల గిరిప్రదక్షిణ

కదిరి అర్బన్ : శ్రీవారి జన్మ నక్షత్రం స్వాతి సందర్భంగా శనివారం భక్తులు పట్టణానికి 3 కి.మీ. దూరంలో కుమ్మరవాండ్ల గ్రామంలో కాటమరాయుడుగా చెంచులక్ష్మీ సమేతంగా శ్రీకొండల లక్ష్మీనరసింహస్వామి వెలసిన కదిరి కొండ చుట్టూ గిరి ప్రదక్షిణ చేశారు. పట్టణ ప్రముఖులు, భక్తులు సుమారు 2వేల మంది ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం నుంచి పాదయాత్ర చేపట్టగా ఆర్డీవో శర్మ ప్రారంభించారు. ఆలయ అర్చకులు కదిరి కొండకి హారతి ఇచ్చిన తర్వాత భక్తులు ఖాద్రీ గిరిప్రదక్షిణను ప్రారంభించారు. ఆర్డీవో మాట్లాడుతూ గిరి ప్రదక్షిణ చేసే భక్తులకు సరైన రహదారి, సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. గిరిప్రదక్షిణ భక్తులకు కుమ్మరవాండ్లపల్లి గ్రామస్తులు, శ్రీఖాద్రీ నృసింహస్వామి సమితి సభ్యులు పానకం, మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు. ఆలయ అధికారులు ప్రసాదం వితరణ చేశారు. పట్టణానికి చెందిన కోటిరెడ్డి భక్తుల కోసం అల్పాహారం ఏర్పాటు చేశారు.

మహిళా పోలీస్‌కు సన్మానం

ఓబులదేవరచెరువు : మండలంలోని అల్లాపల్లి గ్రామ సచివాలయ మహిళా పోలీస్ ధనలక్ష్మిని శనివారం అల్లాపల్లి పంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ధనలక్ష్మి అల్లాపల్లి నుంచి మామిళ్లకుంట్లపల్లి గ్రామ సచివాలయానికి బదిలీ అయ్యారు. దీంతో అంగన్వాడీ కార్యకర్తలు ఆమెను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు షమీమ్, స్వర్ణ, సునంద, మంజుల, శ్యామల, పార్వతి, వెంకటనరసమ్మ, ప్రమీల, శ్యామల, సుకన్య, ఇందిర, ఎస్.శ్యామల, పి.సుకన్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఎంప్లాయిస్ యూనియన్ రీజినల్ అధ్యక్షులు జివైపి.రావు డిమాండ్ చేశారు. ఈయూ అధ్యక్షులు దివాకర్ అధ్యక్షతన రెండో రోజైన శనివారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేపట్టారు. ముఖ్య అతిథులుగా హాజరైన జివైపి.రావు, ఆర్ఎస్.రెడ్డి, శంకరప్ప, కదిరి డిపో ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి ఎంకె.రెడ్డి, గ్యారేజ్ కార్యదర్శి అక్బర్, కోశాధికారి సురేందర్, ఆర్ఎం.రెడ్డి హాజరయ్యారు. జివైపి.రావు మాట్లాడుతూ మాట్లాడుతూ అన్ని డిపోల్లో ఉద్యోగులు ఎర్ర రిబ్బన్ ధరించి విధులకు హాజరై నిరసన వ్యక్తం చేస్తున్నారని, గేట్ మీటింగులు, ధర్నాలు జరుగుతున్నాయన్నారు. బస్టాండ్ ఆవరణలో విధులకు హాజరయ్యే ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలు ధరించారు. టీ, భోజన విరామంలో గేట్ మీటింగ్, ధర్నా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పురుషోత్తం, రవినాయక్, అనిల్, సుందర్, భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఉద్యోగులు, కార్మికులు ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ధర్నాలో కామ్రేడ్ బుల్ల ఆదినారాయణ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను ఏకరువు పెట్టారు. ధర్నాలో డిపో అధ్యక్షులు జిఎండి.రఫీక్, రీజినల్ సభ్యులు టైగర్ సిద్ధగంగప్ప, గ్యారేజ్ సెక్రటరీ కెటి.స్వామి, ప్రచార కార్యదర్శి టి.రవి, యూనియన్ నాయకులు జె.ప్రకాష్‌నాయుడు, పాల్గొన్నారు.


ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

డ్రైవర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

ధర్మవరం రూరల్ : ధర్మవరం ఆర్టీసీ డిపోలో డ్రైవర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని డిపో మేనేజర్ సత్య నారాయణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీలో అవసరమైన సమయంలో డ్రైవర్‌గా(ఆన్ కాల్ డ్రైవర్లు) విధులు నిర్వహం చేందుకు గాను ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి డిపో మేనేజర్ కార్యాలయంలో వివరాలు తెలియజేయాలన్నారు.

సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

కొత్తచెరువు : కొత్తచెరువులో ఈ నెల 10వ తేదీ సిఎం చంద్రబాబు విద్యార్థులు, వారి తల్లిదండ్రు లతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో సిఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను శనివారం జెసి అభిషేక్ కుమార్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, జడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల క్రీడా మైదానం లో జరుగుతున్న పనులను వేగవంతం చేయాలన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

తాడిమర్రి : మండలంలోని చిల్లకొండయ్యపల్లి గ్రామంలో శనివారం ఎస్ఐ కృష్ణవేణి ఆధ్వర్యంలో పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, వాటి నివారణ మార్గాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మొహర్రం పండుగను ప్రజలందరూ కలిసిమెలిసి సంతోషంగా జరుపుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వేడుకలు చేసుకోవాలన్నారు.

భవిత కేంద్రం ప్రారంభం

గాండ్లపెంట : స్థానిక జడ్పీ హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన భవిత కేంద్రాన్ని శనివారం ఎంఇఒలు బి.కృష్ణానాయక్, శ్రీనివాసులు, హెచ్‌ఎం టి.ప్రసాద్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సుమారు పదేళ్లుగా ఇరుకైన గదులు ఉండటంతో పిల్లలు ఇబ్బందులు పడుతుండేవారన్నారు. ఇప్పుడు అన్ని సౌకర్యాలతో ఓ గది ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. అక్కడ ఇద్దరు ఉపాధ్యాయులు, ఒక ఆయా, సిబ్బంది ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పామిడి ముంతాజ్ అలీ, లక్ష్మి, రాజేశ్వరి, వాణిశ్రీ, దేవనాథరెడ్డి, భారతి, సిఆర్‌పి రమేష్, పాల్గొన్నారు.

8న వైఎస్ఆర్ జయంతి

హిందూపురం : నియోజకవర్గం వ్యాప్తంగా ఈ నెల 8వ తేదీ దివంగత సిఎం వైఎస్ఆర్ జయంతి వేడుకలను విజయవంతం చేద్దామని వైసిపి నియోజకవర్గ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో శనివారం నియోజకవర్గ వైసిపి నాయకులతో సమావేశం నిర్వహించారు. వేణురెడ్డి మాట్లాడుతూ పురంలో వైసిపి కార్యాలయం నుంచి పరిగి బస్టాండ్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్దకు ర్యాలీగా వెళ్లి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తామన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

పరిగి : స్థానిక షాదీమహల్‌లో ఆదివారం కిమ్స్ సవీరా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత గుండె, కంటి పరీక్షల శిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచి లక్ష్మీదేవి శివశంకర్ వెల్లడించారు.

డ్రైయినేజీల్లో పూడిక తొలగింపు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని దొడగట్ట పంచాయతీ పరిధిలోని దొడగట్ట బిసి కాలనీలో కొన్ని రోజులుగా డ్రైయినేజీ కాలువల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి మురుగునీరు ముందుకు కదలడం లేదు. ఈ నేపథ్యంలో గత మంగళవారం ప్రజాశక్తి దినపత్రికలో 'అధ్వానంగా డ్రైయినేజీ కాలువలు.. కదలని మురుగు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఈవోఆర్డీ గోవిందప్ప ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి జనార్ధన్, సర్పంచి వనజ, ఎంపిటిసి బాలాజీ ఆ గ్రామంలో పర్యటించి డ్రైయినేజీల్లో పూడిక తొలగించారు. అలాగే జెసిబి సాయంతో కాలువ తీయించి మురుగునీరు సజావుగా కదిలేలా ఏర్పాట్లు చేశారు. దొడగట్ట గ్రామం మొత్తం పారిశుధ్యం చర్యలు చేపట్టారు.


జెసిబి సాయంతో మురుగు నీటి కాలువ తీయిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యం

ప్రజాశక్తి-రొద్దం

సిఎం చంద్రబాబుతోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని టిడిపి మండల నాయకులు తెలిపారు. మంత్రి సవిత ఆదేశాల మేరకు 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా శనివారం టిడిపి నాయకులు మండలంలోని శ్యాపురం గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సుపరిపాలన కరపత్రాలను పంపిణీ చేశారు. మండల నాయకులు మాధవ నాయుడు మాట్లాడుతూ చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఉత్తమ పరిపాలన అందిస్తుందన్నారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని ఆరా తీశారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమం లో నాయకులు రామకృష్ణ, చంద్రమౌళి, చిన్నప్పయ్య, చిన్నమంతూరు పవన్, శ్రీనాథ్‌చౌదరి, కంబాలపల్లి సర్పంచి మంజు, రొద్దం క్లస్టర్ ఇన్‌ఛార్జి సిద్దన్న, కంబాలపల్లి డీలర్ రామాంజనేయులు, మోపర్లపల్లి లింగప్ప, తదితరులు పాల్గొన్నారు


సుపరిపాలనలో తొలిఅడుగు కరపత్రాలు పంపిణీ టిడిపి నాయకులు

దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేద్దాం : సిఐటియు

ప్రజాశక్తి-పెనుకొండ

ఈ నెల 9వ తేదీ దేశవ్యాప్తంగా చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేద్దామని సిఐటియు, రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో శనివారం దేశవ్యాప్త సమ్మె కరపత్రాలను విడుదల చేశారు. సిఐటియు మండల కన్వీనర్ బాబావలి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం, ఈఎస్ఐ, పిఎఫ్ అమలు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, యథావిధిగా 8 గంటల పని విధానం, రవాణా రంగం కార్మికుల వేతనాలు బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాల న్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బావమ్మ, వెంకటేష్, నరసింహ, శ్రీరామరవి, మంజు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

నంబులపూలకుంట : దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేద్దామని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు నంబులపూలకుంటలో సిఐటియు నాయకుడు నాగరాజు ఆధ్వర్యంలో సమ్మె పోస్టర్ విడుదల చేశారు. కార్మిక చట్టాలను పరిరక్షించుకు నేందుకు చేపట్టనున్న సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఇరగమ్‌రెడ్డి, గురప్ప, ఉత్తన్న తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు విడుదల చేస్తున్న సిఐటియు, రైతు సంఘం నాయకులు

చిలమత్తూరు : సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో మండలంలోని అన్ని పరిశ్రమలు, బ్యాంకులు, కార్యాలయాల్లో కార్మికులు సమ్మె నోటీసులు అందజేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను నిలిపేయాలని, అంగన్వాడీ, ఆశా, 108, 104, సమగ్ర శిక్ష వంటి స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు, పెన్షన్, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన పని గంటలను తగ్గించాలి, మహిళలకు రాత్రి షిఫ్ట్ విధులను నిలిపివేయాలని, స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రామచంద్ర, ఫిరంగి ప్రవీణ్‌కుమార్, రమేష్, సదాశివరెడ్డి, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

నియోజకవర్గ అభివృద్ధే తమ లక్ష్యమని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పేర్కొన్నారు. సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం ఆమె మండలంలోని కొట్లపల్లి గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ పాలన గురించి వివరించారు. ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారు. సమస్యలపై ఆరా తీసి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి రెండో తరగతి విద్యార్థులకు సైన్సు పాఠం బోధించారు. గ్రామ సచివాలయాన్ని సందర్శించి రికార్డులు, సిబ్బంది హాజరును పరిశీలించి గైర్హాజరైన వారికి సెలవు మంజూరు చేశారు. ప్రజలు తాగునీటి సమస్యపై ఫిర్యాదు చేయగా వెంటనే పరిష్కరించాలని గ్రామ సచివాలయ కార్యదర్శి గణేష్‌ను ఆదేశించారు. అనంతరం రాచువారిపల్లి గ్రామం వెళ్లి టిడిపి మండల కన్వీనర్ విజయ్‌కుమార్ తండ్రి వెంకటేష్ ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, నాయకులు శ్రీరామ్‌రెడ్డి, శ్రీరామ్‌నాయక్, సామకోటి ఆదినారాయణ, పుల్లప్ప, నాగరాజు, జగన్, రామయ్య, నాగిరెడ్డి, పెద్దప్పయ్య, నరసింహప్ప, మహేష్, వెంకటప్ప, నారాయణస్వామి, కేశవ పాల్గొన్నారు.


సుపరిపాలనలో తొలిఅడుగు కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, టిడిపి నాయకులు

రిషి విద్యాలయంలో నో బ్యాగ్ డే

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

నవీన విద్యా విధానానికి తొలి అడుగులో భాగంగా పట్టణంలోని రిషి విద్యాలయంలో శనివారం నో బ్యాగ్ డే అండ్ పి-త్రీ మోడల్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు డీన్ భాస్కర్, సీఈవో రవీంద్ర, ప్రిన్సిపల్ కరణ్ స్వరూప సింగ్, వైస్ ప్రిన్సిపల్ కళ్యాణి తెలిపారు. వారు మాట్లాడుతూ రిషి పాఠశాలలో విద్యార్థులకు ఒత్తిడి లేకుండా విద్యను అందించాలన్న ప్రధాన లక్ష్యంతో నో బ్యాగ్ డే కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రతి శనివారం విద్యార్థులు వినోదాత్మక, క్రియాత్మక విద్యా పద్ధతుల ద్వారా నేర్పిస్తామన్నారు. అలాగే పీ-త్రి మోడల్‌లో పర్పస్, ఫ్యాషన్, ప్రొఫార్మెన్స్, పద్ధతుల ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, కలుపుగోలుతనం పెరుగుతాయన్నారు. ఈ పద్ధతి ద్వారా తల్లిదండ్రులు, విద్యార్థుల నుంచి సానుకూల స్పందన లభిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని విద్యారంగంలో మార్పులకు దారి తీసేలా పని చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


నారాయణస్వామికి ఆర్థికసాయం అందజేస్తున్న టిడిపి నాయకులు

టిడిపి కార్యకర్త వైద్యానికి రూ. 50వేలు అందజేత

పరిగి : ఇటీవల పెనుకొండలో జరిగిన ఓ ప్రమాదంలో గాయపడి హిందూపురంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పరిగి బూత్ ఇన్‌ఛార్జి నారాయణస్వామిని శనివారం టిడిపి మండల కన్వీనర్ గోవింద్‌రెడ్డి, మారుతిప్రసాద్ పరామర్శించారు. అలాగే మంత్రి సవిత అతడి వైద్య ఖర్చుల కోసం ఇచ్చిన రూ. 50వేలను అతడికి అందజేశారు. తన వైద్యానికి మంత్రి ఆర్థిక సాయం అందించడంపై నారాయణస్వామి కుటుంబ సభ్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్ కన్‌స్ట్రక్షన్ మహేష్, పరిగి చంద్రశేఖర్, లోకేష్, పరిటాల శివ, తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు ఎంఇఒగా నాగరాజు

చిలమత్తూరు : మండల ఇన్‌ఛార్జి ఎంఇఒ-1గా నాగరాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు మండల జెఎసి నాయకులు, ఉపాధ్యాయులు ఘనంగా స్వాగతం పలికారు. నాగరాజు మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థను అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు ప్రతి ఉపాధ్యాయుడి సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 సల్మాన్‌రాజ్, పలువురు ఉపాధ్యాయులు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికునికి పాముకాటు

ధర్మవరం రూరల్ : విధి నిర్వహణలో భాగంగా శనివారం పట్టణంలోని ఎర్రగుంట రైల్వే బ్రిడ్జి పార్క్ వద్ద శుభ్రం చేస్తున్న అవుట్ సోర్సింగ్ మున్సిపల్ వర్కర్ శాంతమూర్తిని పులి బెంజరి పాము కాటు వేసింది. దీంతో శాంతి మూర్తి కేకలు పెట్టగా స్థానికులు గమనించి ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, శానిటరీ సెక్రటరీ శాంతి, ఇన్‌స్పెక్టర్ శాంసన్, తదితరులు ఆసుపత్రికి వెళ్లి శాంతిమూర్తిని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పుట్టపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శాంతిమూర్తి ఆరోగ్యంగా ఉన్నాడని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.

అగళి ఎంపిడిఒగా రాజేంద్రప్రసాద్

అగళి : మండల నూతన ఎంపిడిఒగా రాజేంద్రప్రసాద్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు పంచాయతీ కార్యదర్శులు పూలబొకే ఇచ్చి అభినందనలు తెలిపారు. నూతన ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ మండల అభివృద్ధి ఎళ్లవేళలా కృషి చేస్తామని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు సహకరించాలని కోరారు.

నేరాలు ఘోరాలు



ప్రమాదంలో మృతిచెందిన సదాశివ, ఓబిలేసు

బొలెరో, బైక్ ఢీ.. ఇద్దరు మృతి

ప్రజాశక్తి-బత్తలపల్లి

అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై బత్తలపల్లి బైపాస్ రోడ్డులోని వేల్పుమడుగు క్రాస్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఎస్ఐ సోమశేఖర్ తెలిపిన వివరాలు.. మండలంలోని గంటాపురం గ్రామానికి చెందిన భూమే ఓబిలేసు(38) ద్విచక్ర వాహనంపై బత్తలపల్లి నుంచి స్వగ్రామం వెళ్తూ మార్గ మధ్యలో గుమ్మలకుంట గ్రామానికి చెందిన సదాశివ(32)ను ఎక్కించు కున్నాడు. వారు బత్తలపల్లి బైపాస్ వద్ద వేల్పుమడుగు రోడ్డు క్రాస్ చేస్తున్న సమయంలో అనంతపురం నుంచి తమిళనాడుకు జీవాలతో వెళ్తున్న బొలెరో వాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ఓబిలేసు, సదాశి అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ సోమశేఖర్, ఎఎస్ఐ సోమశేఖరమూర్తి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను హైవే అంబులెన్స్‌లో ఆర్టీటీ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న గంటాపురం గ్రామస్తులు, మృతుల బంధువులు సంఘటనా స్థలానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. వారి రోదనలు మిన్నంటాయి. ఓబిలేసుకు భార్య రమణమ్మతో పాటు ఇద్దరు కుమారులు, సదాశివకు భార్య శివకాంతతో పాటు ఓ కుమారుడు ఉన్నారు. సదాశివ ఏడేళ్లుగా బత్తలపల్లిలో నివాసముంటున్నాడు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైతు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-తాడిమర్రి

మండలంలోని చిల్లకొండయ్యపల్లి గ్రామంలో శనివారం ఓ రైతు అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. వివరాలు.. చిల్లకొండయ్యపల్లికి చెందిన రైతు చిగిచెర్ల చిన్ననారాయణ(70) ప్రతి రోజూ లాగానే ఆవులను మేపడానికి పొలానికి తీసుకెళ్లాడు. సాయంత్రం 4 గంటల సమయంలో తన కుమారుడు గురు ప్రసాద్‌కి ఫోన్ చేసి ఆవు దూడ కనిపించడం లేదని తెలిపాడు. దీంతో రైతు కుమారుడు, తల్లి ఇద్దరూ వెతుకుతూ వెళ్లగా ఓ నీటి గుంతలో చిగిచెర్ల చిన్న నారాయణ, ఆవు దూడ నీటిలో తేలుతూ కనిపించారు. వెంటనే కుమారుడు నీటి గుంతలోకి దిగి గట్టుపైకి తరలించగా అప్పటికే చిన్న నారాయణతో పాటు ఆవు దూడ మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ కృష్ణవేణి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. రైతు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సన్నగిల్లుతున్న ఆశలు..!



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే ఖరీఫ్‌పై ఆశలు సన్నగిల్లుతున్నాయి. మే నెలలో మండు వేసవి మంచి వర్షాలొచ్చాయి. దీంతో ఈ సీజన్ మంచి వర్షాలొస్తాయని రైతులు ఆశించారు. ఈ మేరకు దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేసుకున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన జూన్ మాసంలోనే వర్షం నేల పడకపోవడంతో ఆశలు సన్నగిల్లుతూ వస్తున్నాయి. జూన్ నెల మొత్తానికి రెండు రోజులు మాత్రమే వర్షం పడింది. అది కూడా కొన్ని ప్రాంతాల్లోనే వర్షపాతం నమోదయింది. చాలా ప్రాంతాల్లో చినుకు జాడలేదు. ఇక జిల్లాలో ఖరీఫ్ సాగుకు అత్యంత కీలకమైన నెల జులై మాసమే. ఈ నెల రెండవ వారం వరకు ఇదే పరిస్థితి కొనసాగుతే పంటల సాగు ప్రశ్నార్థకమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. రోజు కారు మబ్బులు కమ్ముకుని రావడం తేలిపాటి చిరుజల్లులు పడి మేఘాలు గాల్లోనే తేలిపోతున్నాయి. రైతులు ఒక పదునైనా కాదా అంటూ ఆకాశం వైపు చూస్తున్నారు. ఖరీప్ వ్యవసాయంలో ఎక్కువ విస్తీర్ణంలో సాగయ్యే వేరుశనగ క్రమక్రమంగా తగ్గిపోతూ వస్తోంది. ఇతర పంటల వైపే రైతులు మొగ్గు చూపుతున్నారు. కంది, ఆముదం, పత్తి తదితర పంటలు సాగు చేసుకుంటున్నారు. వేరుశనగ అయితే పెట్టుబడులు ఎక్కువ, దిగుబడులు తక్కువగా అన్నట్టుగా మారడంతో రైతులు పంటల సరళిలో మార్పు వస్తోంది. మారినప్పటికీ ప్రకృతి మాత్రం ఏ మాత్రం రైతుకు సహకరించే పరిస్థితులు కనిపించడం లేదు. గతేడాది జూన్ మాసం మంచి వర్షాలొచ్చినప్పటికీ జులై మాసంలో వర్షాభావం నెలకొంది. ఆగస్టు రెండవ వారం నుంచి విపరీతంగా వర్షాలు పడ్డాయి. సీజన్‌లో విత్తనం విత్తుకునే సమయంలో లేకపోవడంతో రైతులు పూర్తి స్థాయిలో పంటలు సాగు చేయలేకపోయారు. ఇక ఈసీజన్ కూడా ఇదే వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయి.

ఉమ్మడి జిల్లాకు తాగు, సాగునీటిని అందించే రెండు జలాశయాలు తుంగభద్ర, శ్రీశైలం డ్యామ్‌లకు నీరొచ్చింది. ఈ నీటిని తీసుకునేందుకు ఇప్పుడు వీల్లేకుండా ఉంది. తుంగభద్ర డ్యామ్ నుంచి తీసుకోవలంటే ఎగువ ప్రధాన కాలువ మరమ్మతు పనులు పూర్తవలేదు. ఇవి పూర్తయి తీసుకోవడానికి చాలా సమయమే పెట్టనుంది. అప్పటి వరకు అవకాశమున్నా నీటిని తీసుకోలేకపోతున్నాం. ఇక శ్రీశైలం నుంచి తీసుకోవాలన్నా హంద్రీనీవా వెడల్పు పనులు నడుస్తున్నాయి. ఇవి పూర్తవుతేగాని హంద్రీనీవాకు నీళ్లు రావు. ఇలా అవకాశమున్న దగ్గర నీరు తీసుకోలేక సకాలంలో ఆయకట్టు రైతుకు నష్టం చేకూరే పరిస్థితులే కనిపిస్తున్నాయి.

ఈ వారంలో రాజకీయంగా అధికార పార్టీలో పెద్ద దుమారమే రేగింది. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుక సంస్థకు చెందిన ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ కొనుగోలు చేసి ఇ-స్టాంపు ట్యాంపరింగ్ విషయం రాజకీయ దుమారం రేపింది. స్టాంపు వెండర్ ద్వారా ఈ ట్యాంపరింగ్ జరిగిందని పోలీసులు కేసు నమోదు చేసి అతడిని అరెస్టు చేశారు. అది అధికారపార్టీకి చెందిన మరో నాయకుడే కుట్ర పన్నారని రావడం, దానికి ఆయన కూడా స్పందించి తాను చేయలేదని మీడియా సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. శింగనమల నియోజకవర్గంకు సంబంధించి ఎమ్మెల్యే బండారు శ్రావణి , టుమెన్ కమిటీ సభ్యుల మధ్య విభేదాలు రచ్చకెక్కాయి. నియోజకవర్గం పరిధిలో పార్టీ కమిటీల ఏర్పాటులో వివాదాలు కొనసాగాయి. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిల మధ్య తాడిపత్రికి చేరే విషయంలో వివాదం రచ్చకెక్కింది.